పెట్రోల్ బంకుల్లో నయా మోసాలు

- వినియోగదారుని జేబుకు చిల్లు
- బంకుల్లో కనీస వసతులు కరువు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఆందోళన చేస్తే హడావిడి



ఇటీవల సీజ్ చేసిన నందిగామ సమీపంలోని ఓ పెట్రోల్, డీజిల్ బంకు

నందిగామ రూరల్: పెట్రోల్, డీజిల్ బంకుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు పాతర వేస్తున్నారు. ముఖ్యంగా కొత్త రకం మోసాలకు తెర తీస్తున్న ఘటనలు నెలకొంటున్నాయి. పెట్రోల్, డీజిల్ బంకుల్లో జరిగే మోసాలతో వినియోగదారుని జేబుకు చిల్లులు పడుతున్నాయి. బంకు నిర్వాహకుల జేబులు మాత్రం మోసపు సొమ్ముతో కళకళలాడుతున్నాయని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండలంలోని అడవిరావులపాడు గ్రామ సమీపంలోని ఓ పెట్రోల్, డీజిల్ బంకును సీజ్ చేశారు. అంతేకాకుండా పెట్రోల్ బంకుల్లో నిబంధనలకు మేరకు వినియోదారులకు అందించాల్సిన కనీస వసతులు సైతం కల్పించని పరిస్థితి. తమనెవరు అడుగుతారులే అనే ధీమానో ఏమో తెలియదు కాని.. బంకుల్లో పని చేసే సిబ్బంది, పలు యాజమాన్యాలు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

బంకుల్లో సిబ్బంది నిర్లక్ష్య వైఖరి

నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాల పరిధిలో సుమారుగా 22 పెట్రోల్, డీజిల్ బంకులు ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం బంకుల్లో కనీస వసతులు కల్పించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పలు బంకుల్లోని సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంకులో ఇంధనం నింపే గన్‌కు ఒక పక్కన వాహనాన్ని నిలిపితే మరో పక్కకు వాహనాన్ని తీసుకురావాలని చెబుతున్నారు. అదేమంటే ఇటు వస్తేనే ఇంధనం నింపుతామని ఖరాఖండిగా చెబుతున్నారని చేసేది లేక వారు చెప్పినట్లుగానే ఇంధనం నింపుకోవాల్సిన దుస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు.

జంప్ ట్రిక్‌తో మోసాలు

పెట్రోల్, డీజిల్ బంకుల్లో నిర్వాహకులు కొత్త తరహా మోసాలకు తెర తీస్తున్నారు. ముఖ్యంగా జంప్‌ట్రిక్, ఇంటిగ్రేటెడ్ చిప్‌లు ఏర్పాటు చేసి వినియోగదారులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. జంప్‌ట్రిక్ పద్ధతిలో ముందుగానే మెషిన్‌లో మార్పులు చేసి రీడింగ్‌ను అధికంగా చూపేలా సర్దుబాటు చేస్తారు. ఇలా చేయడం వల్ల చెల్లించిన డబ్బుకు తగ్గట్లుగా కాకుండా ఇంధనం తక్కువగా వస్తుంది. ఎటువంటి మోసాలకు ఆస్కారం లేని బంకుల్లో మాత్రం ఇంధనం నింపే సమయంలో మీటరు నెమ్మదిగా పెరుగుతుంది. కానీ ఈ జంప్‌ట్రిక్ ఉన్న బంకుల్లో మాత్రం ప్రారంభంలోనే మీటరు సున్నా నుంచి ఒక్కసారిగా రూ. 10, రూ. 20లకు చేరుతుంది.

పట్టించుకోని అధికారులు

పెట్రోల్, డీజిల్ బంకుల్లో ఎన్ని మోసాలు జరుగుతున్నా, నిబంధనలను బేఖాతరు చేస్తున్నా పౌర సంబంధాల, తూనికలు, కొలతలు, లీగల్ మెట్రాలజీ శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందని వినియోగదారులు అంటున్నారు. నిర్దిష్ట సమయంలో చేయాల్సిన తనిఖీలను కూడా పూర్తి స్థాయిలో నిర్వహించకుండా మమ అనిపిస్తుండటంతోనే వారి ఆటలు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి నిబంధనల మేరకు వసతులు కల్పించడంతో పాటు మోసాలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



నందిగామలోని ఓ పెట్రోల్, డీజిల్ బంకులో పని చేయని గాలి మిషన్

ఈ వసతులు ఉండాల్సిందే..

పెట్రోల్, డీజిల్ బంకుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఫిర్యాదుల పుస్తకం, ప్రథమ చికిత్స కిట్, ఫోన్ సౌకర్యం, ఫ్రీ ఎయిర్ కోసం టైర్ ఇన్‌ఫ్లేటర్, సీసీ కెమెరాలు, ఇసుక బకెట్లు విధిగా అందుబాటులో ఉండాలి. కాని ఎక్కువ శాతం బంకుల్లో మచ్చుకు కూడా ఇవి కనిపించడం లేదు. వీటితో పాటు పెట్రోల్, డీజిల్ నాణ్యతను తెలుసుకునేందుకు ఫిల్టర్ పేపర్ అందుబాటులో ఉంచాల్సి ఉంది. అంతే కాకుండా ఇంధన నిల్వ వివరాలు, ధరల పట్టిక, కంపెనీ, డీలర్, సిబ్బంది పేరు, ఫోన్ నంబరుతో కూడిన బోర్డులు ఉండాలి. అయితే చాలా బంకుల్లో కూడా వాటిని ఏర్పాటు చేయలేదు.

ప్రభుత్వాస్పత్రి పరిశీలన



నందిగామ టౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని డీఎంహెచ్‌వో సుహాసినితో కలిసి శుక్రవారం కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ సందర్శించారు. ఆస్పత్రి మొత్తం తిరిగి పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించి డీఎంహెచ్‌వో, ఆస్పత్రి చైర్మన్ నాగేశ్వరరావులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పర్యటనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య చర్యలు బాగున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

చందర్లపాడు(నందిగామ రూరల్): చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన కారణంగా శనివారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ట్రాఫిక్ మళ్లించినట్లు నందిగామ రూరల్ సీఐ చవాన్ పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న ప్రజావేదిక ఏర్పాటు పనులను ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నందిగామ నుంచి చందర్లపాడు వైపు వెళ్లే వాహనాలను డీవీఆర్ కాలనీ, అడవిరావులపాడు, కోనాయపాలెం, బొబ్బిళ్లపాడు మీదుగా మళ్లించినట్లు తెలిపారు. నందిగామ నుంచి తోటరావులపాడు వైపు వెళ్లే వాహనాలను చందాపురం, కేతవీరునిపాడు, తుర్లపాడు మీదుగా మళ్లించగా చందర్లపాడు, చింతలపాడు, ఏటూరు, తోటరావులపాడు వైపు నుంచి వచ్చే వాహనాలను తుర్లపాడు, కంచల, కీసర మీదుగా నందిగామ, విజయవాడ వైపు మళ్లించినట్లు వివరించారు. వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

వత్సవాయి: బీసీ, ఈబీసీ, వైశ్య, కమ్మ, కాపు కార్పొరేషన్లకు సంబంధించి మండలంలోని దరఖాస్తుదారులకు ఈనెల ఎనిమిదవ తేదీన దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్ రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు షెడ్యూలు ప్రకారం హాజరుకావాలని కోరారు. ఉదయం పది గంటల నుంచి భీమవరం, మక్కపేట, చిన్నమోదుగపల్లి, చిట్టేల, దేచుపాలెం, గోపినేనిపాలెం, కన్నెవీడు, ఇందుగపల్లి, మంగొల్లు, పెద్దమోదుగపల్లి, రామచంద్రాపురం, శింగవరం గ్రామాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోలంపల్లి, దబ్బాకుపల్లి, వత్సవాయి, పోచవరం, లింగాల, పెంట్యాలవారిగూడెం, ఆళ్లూరుపాడు, తాళ్లూరు, వేమవరం, కంభంపాడు, మాచినేనిపాలెం, కాకరవాయి, వేములనర్వ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నందిగామ టౌన్: పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యంతోపాటు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రతీ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఏఈ ఫణి శ్రీనివాస్, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ



భీమవరం(వత్సవాయి): చిలకల్లు వైరా రహదారిపై ఎస్ఎస్‌పీ పెద్ద కాలువ సమీపంలో లారీ చెట్టును ఢీకొట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తెలంగాణా నుంచి బొగ్గు లోడుతో చిల్లకల్లు వైపు వస్తున్న లారీ పెద్దకాలువ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో లారీలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. కాగా అతనికి ఎటువంటి గాయాలు కాలేదు.

నేడు సీఎం చంద్రబాబు పర్యటన

చందర్లపాడు(నందిగామ రూరల్): చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ముప్పాళ్ల గ్రామంలోని గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. హెలీప్యాడ్ వద్దనే 11 గంటల వరకు రిప్రజంటేషన్‌ల స్వీకరణ, నాయకులతో ఇంటరాక్షన్ జరుగుతుందన్నారు. తర్వాత గురుకుల పాఠశాలను పరిశీలించి 11.46 గంటలకు ప్రజావేదిక ప్రాంగణానికి చేరుకుని బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. పర్యటన పూర్తి చేసుకుని 3.39 గంటలకు తిరిగి వెళతారు.

నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

నందిగామ రూరల్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటలకు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: వక్ఫ్ బోర్డు సవరణలకు వ్యతిరేక నిరసన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు మసీదుల వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి ఎస్ నాగమణి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతోందన్నారు. ఇతర మతాల వారిని వక్ఫ్ బోర్డుల్లో సభ్యులుగా చేర్చి వాటిని వివాదాస్పదం చేసే కుట్ర ఈ సవరణ బిల్లులో ఉందని దీనిని అందరూ వ్యతిరేకించాలని కోరారు. సీపీఎం నాయకులు వీవీ రాంప్రసాద్, రావెళ్ల శేషు, బూషమ్మ, షేక్ మేరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారుల స్పందన కరువు



దరఖాస్తులు పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): కార్పొరేషన్‌ల రుణాల కోసం దరఖాస్తుదారులకు నిర్వహించే ఇంటర్వ్యూలకు బ్యాంకు అధికారుల నుంచి స్పందన కరువైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు ఆయా కార్పొరేషన్‌ల రుణాల కోసం 1020 మందికిగానూ 620 మంది దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కాగా కెనరా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్, సప్తగిరి బ్యాంకు అధికారులు మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహించారు. మిగిలిన బ్యాంకులకు సంబంధించిన వారు రాలేదు. దీంతో ఆయా గ్రామాల కార్యదర్శులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బ్యాంకు అధికారుల గైర్హాజరుపై దరఖాస్తుదారులు ప్రశ్నించగా తమకు కూడా తెలియదని మండల పరిషత్ అధికారులు చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా మండలానికి బీసీ 65, ఈబీసీ 11, కాపు 17 చొప్పున మొత్తం 99 యూనిట్‌లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ రుణాలను ప్రభుత్వ పెద్దలు ఎప్పుడో తమతమ వారికి కేటాయించుకుని ఉంటారని అందుకే బ్యాంకు అధికారులు సైతం ఇంటర్వ్యూలకు హాజరవలేదంటూ దరఖాస్తుదారులు వెనుదిరిగారు.

•అకాల వర్షం.. ఆందోళనలో అన్నదాతలు



పెనుగంచిప్రోలు వద్ద తడిసిన మొక్కజొన్న చూపుతున్న రైతులు



మిర్చి రాశులపై కప్పిన పట్టాలపై వర్షపు నీరు

వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారి జల్లులు పడటంతో రైతులు పట్టాలతో కల్లాలకు పరుగులు తీశారు. అర్ధరాత్రి తర్వాత పడిన జల్లులకు కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న తడిశాయి. మరో రెండు రోజులు ఇదే వాతావరణం ఉంటుందని అధికారులు చెబుతుండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. - పెనుగంచిప్రోలు

కనీస వసతులు కరువు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని జాతీయ రహదారి పక్కనున్న మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో ప్రతి శనివారం జరిగే పశువుల సంతలో మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో రైతులు, క్రయ విక్రయదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి శనివారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలువురు జీవాలు, పశువుల క్రయ విక్రయాలు చేస్తుంటారు. వేసవి కాలం కావడంతో మూగ జీవాలు నీటికి ఇబ్బందులు పడుతున్నాయి. నీటి తొట్టెలున్నప్పటికీ అవి అధ్వానంగా ఉండటంతో జీవాలు అల్లాడుతున్నాయి. టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో క్రయ విక్రయదారులు ఎండ వేడిమి తాళలేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా సంతకు ప్రహరీ, గేట్లు లేకపోవడంతో సంత ప్రాంగణం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. రాత్రి సమయాల్లో మందుబాబులు మద్యం తాగి సీసాలను పగలగొట్టడంతో ఉదయమే వచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యార్డు అధికారులు స్పందించి సంతలో కనీస వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

జగ్గయ్యపేట అర్బన్: లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ నియోజకవర్గ సమావేశం శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సమైక్య ప్రజా సంఘాలు మే 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆశా వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కమల, వత్సవాయి సీఐటీయూ మండల కార్యదర్శి బీ రాము, జగ్గయ్యపేట మండల నాయకుడు శేషుకుమార్, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఎం వెంకటరమణ, కే బేబీరాణి, సుజాత, సత్యావతి, సుధారాణి, కనకదుర్గ, వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు



జవ్వాజి నరసింహారావును సత్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీకి చెందిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన జవ్వాజి నరసింహారావును పార్టీ కార్యాలయంలో శుక్రవారం తన్నీరు నాగేశ్వరరావు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో మొదటి నుంచి బీసీల సంక్షేమానికి కృషిచేశారని అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వారికి అండగా నిలిచారని తెలిపారు. జవ్వాజి నరసింహారావు కూడా నియోజవర్గంలో బీసీలకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు లాహోరి బద్దూనాయక్, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు బైరబోయిన బాబు, నాయకులు బండి రాజు, పిట్టల సత్యనారాయణ, దార్ల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు



వెంకటాపురం గ్రామంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లు



పెళ్లికుమారుడిగా రాములోరు

పెనుగంచిప్రోలు: శ్రీరామ నవమి ఉత్సవాలకు సంబంధించి ఆలయాలు, మండపాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. అలాగే ఎప్పటి నుంచో శ్రీసీతా రాముల కల్యాణం చేస్తున్న మండపాల వద్ద నవమి ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో కూడా శ్రీరామ నవమి వేడుకలకు ఆలయంలో విగ్రహాలకు రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు.

రాములోరు పెళ్లికొడుకాయనే

మక్కపేట(వత్సవాయి): శ్రీరామ నవమిని పురస్కరించుకుని శుక్రవారం రాములవారిని పెళ్లికుమారుని చేశారు. గ్రామంలో శ్రీ పట్టాభి రామచంద్రస్వామి ఆలయం నుంచి రాములవారిని ఊరేగింపుగా శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి తీసుకునివచ్చారు. అక్కడ భక్తుల జయజయ ధ్వానాల మధ్య రాములోరిని పెళ్లికుమారుని చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం తిరిగి ఊరేగింపుగా రాములవారిని రామాలయానికి తీసుకుని వెళ్లారు.

వాల్వ్‌పిట్ గుంతలపై మూతలు

సాక్షి ఎఫెక్ట్



గాంధీ సెంటర్‌లో వాల్వ్‌పిట్ గుంతపై ఏర్పాటు చేసిన రక్షణ మూతలు

నందిగామ రూరల్: పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లోని వాల్వ్‌పిట్స్ గుంతలపై మున్సిపల్ అధికారులు రక్షణ మూతలు ఏర్పాటు చేశారు. ఇటీవల సాక్షిలో ప్రచురితమైన 'రహదారులపై ప్రమాదకరంగా వాల్వ్‌పిట్స్' కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని కేవీఆర్ కళాశాల పక్క రోడ్డు, గాంధీ సెంటర్ ప్రాంతాల్లోని వాల్వ్‌పిట్స్ గుంతలపై అధికారులు రక్షణ మూతలు ఏర్పాటు చేశారు. కాగా రామన్నపేట రోడ్డు మధ్యలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న వాల్వ్‌పిట్ గుంతపై మాత్రం కనీస చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి సమస్యల స్వాగతం

- నీరు గారుతున్న వేదాద్రి ఎత్తిపోతల ఆశయం
- నిధుల కోసం ఎదురుచూపులు
- నేడు ముప్పాళ్లలో సీఎం చంద్రబాబు పర్యటన



వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం

చందర్లపాడు(నందిగామ టౌన్): నియోజకవర్గంలోని చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం మరమ్మతులు, కేంద్రీయ విద్యాలయానికి స్థలం, నిర్మాణాలకు నిధులు, నూతన భవనం, ప్రస్తుతమున్న ఆస్పత్రి స్థలంలో కాకుండా విశాల ప్రాంగణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం తదితర సమస్యలు ముఖ్యమంత్రి రాకకోసం ఎదురుచూస్తున్నాయి.

నీరుగారుతున్న ఆశయం

సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించాలనే లక్ష్యంతో జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి గ్రామ సమీపంలోని కృష్ణానదిపై ఏర్పాటు చేసిన వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథక ఆశయం నీరుగారుతోంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం నిర్మించి వ్యవసాయ భూములకు పుష్కలంగా సాగు నీరందించారు. ఆ తర్వాత వేదాద్రి ఎత్తిపోతల పథకం గత కొన్నేళ్లుగా మరమ్మతులకు గురై సాగునీరు అందించలేని దుస్థితికి చేరింది. దీంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు గ్రామాలతో పాటు నందిగామ, చందర్లపాడు మండలాలకు చెందిన 32 గ్రామాల రైతులకు చెందిన 17 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగు నీరు అందడం లేదు.

రూ. 12.20 కోట్లతో అంచనాలు

వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ. 12.20 కోట్లు ఖర్చవుతుందని ఐడీసీ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేశారు. నిధులు మంజూరు చేయాలని రెండు నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా నిధులు మాత్రం మంజూరు కాలేదు. ఈక్రమంలో చంద్రబాబు నియోజకవర్గానికి వస్తుండటంతో ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు మంజూరు అవుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అలాగే నియోజకవర్గంలోని కేంద్రీయ విద్యాలయ భవనాల నిర్మాణానికి నిధులు, స్థలం మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇరుకు స్థలంలో వంద పడకలా.?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదెకరాల స్థలంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదెకరాల స్థలంలో కాకుండా ప్రస్తుతమున్న ఆస్పత్రి ఉన్న 2.40 ఎకరాల్లోనే నిర్మించేలా ఆదేశాల జారీ చేశారు. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతమున్న ఆస్పత్రి ప్రాంతంలో వంద పడకల ఆస్పత్రి నిర్మించడం వల్ల కలిగే ఇబ్బందులను పరిశీలించి విశాలమైన స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రక్షిత మంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం



దాన్స్ చేస్తున్న విద్యార్థులు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం పాఠశాల 60వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా ఆనందంతో పలు దేశభక్తి గీతాలు, సినిమా పాటలకు డ్యాన్స్‌లు వేశారు. అనంతరం ఎంఈఓ బీ బాలాజీనాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విని ఆ పాఠాలను ఇంటికి వెళ్లి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అనంతరం వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేరుగ రామారావు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

•వీఆర్వోలతో సమావేశం

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల వీఆర్వోల పని తీరుపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హుసేన్ హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.